## వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్
# విరాట్ కోహ్లీ



దుబాయ్: టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. ఐసీసీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కించుకున్నాడు. నిరుడు కోహ్లీ కనబర్చిన అద్భుత ప్రతిభకు ఐసీసీ ఈ పురస్కారం ప్రకటించింది. ఈ అవార్డు కోహ్లీని వరించడం ఇది నాలుగోసారి కాగా.. ఇదే అత్యధికం. నిరుడు కోహ్లీ వన్డేల్లో 1377 పరుగులు చేశాడు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను దాటేసిన విరాట్.. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన విషయం తెలిసిందే.

## వెస్టిండీస్ 266/8

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో ఘోర పరాజయం పాలైన వెస్టిండీస్.. రెండో టెస్టులో పోరాడుతున్నది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ గురువారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసింది. జాషువా (79), కావెమ్ (71) అర్ధశతకాలు సాధించడంతో విండీస్ మంచి స్కోరు చేయగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ 4, హజిల్‌వుడ్ రెండు వికెట్లు పడగొట్టారు.

# తిప్పేశారు

## బెడిసి కొట్టిన బజ్‌బాల్

అశ్విన్, జడ్డూ మాయాజాలం

ఇంగ్లండ్ 246 ఆలౌట్

భారత్ 119/1

యశస్వి అజేయ అర్ధశతకం



అశ్విన్ (3/68)

భారత పర్యటన ఎలా సాగనుందో తొలి రోజే ఇంగ్లండ్‌కు తెలిసొచ్చింది. సుదీర్ఘ టెస్టు సిరీస్‌లో 'బజ్‌బాల్' 'గిజ్‌బాల్' జాన్తానై.. ఇక్కడే నడిచేదొక్కటే స్పిన్‌బాల్ అన్నట్లు.. మనవాళ్లు దుమ్మురేపడంతో.. ఇంగ్లిష్ టీమ్ తెల్ల మొహం వేసింది!

టెస్టుల్లో ధనాధన్ షాట్లు కొడతాం.. సుదీర్ఘ ఫార్మాట్‌లో పొట్టి పోరు మజా చూపుతాం అని బీరాలు పలికిన ఇంగ్లండ్ ప్లేయర్లు.. ఉప్పల్‌లో నిండా మూడు సెషన్‌లు కూడా క్రీజులో నిలువలేకపోయారు. అటు అశ్విన్, ఇటు జడేజా మాయాజాలానికి పెవిలియన్‌కు క్యూ కట్టారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్.. తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులకే కుప్పకూలితే.. అసలు బజ్‌బాల్ అంటే ఏంటో.. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ స్టోక్స్ సేనకు రుచిచూపాడు. ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ ఉప్పల్ స్టేడియాన్ని హోరెత్తించి ఒక్క సెషన్‌లోనే ప్రత్యర్థి జట్టు పరుగుల్లో సగం బోర్డు మీద చేర్చాడు.



జడేజా (3/88)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐదేండ్ల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్ తొలి రోజే టీమ్ఇండియా అదరగొట్టింది. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ఉప్పల్‌లో ప్రారంభమైన మొదటి టెస్టులో రోహిత్‌సేన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. భారత పిచ్‌లపై నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టమని టాస్ గెలువగానే బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (70; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. మిగిలినవాళ్లు విఫలమయ్యారు. బెయిర్‌స్టో (37), డకెట్ (35), జో రూట్ (29), క్రాలీ (20) మంచి ఆరంభాలను వినియోగించుకోలేకపోయారు. ఓలీ పోప్ (1), ఫోక్స్ (4) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అశ్విన్, జడేజా చెరో మూడు వికెట్లు పడగొట్టగా..బుమ్రా, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్ఇండియా.. గురువారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 119 పరుగులు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో కదంతొక్కగా.. రోహిత్ శర్మ (24) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జాక్ లీచ్ ఏకైక వికెట్ పడగొట్టాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న భారత్ ప్రత్యర్థి స్కోరుకు 127 పరుగులు వెనుకబడి ఉంది. జైస్వాల్‌తో పాటు గిల్ (14) క్రీజులో ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లో టీ20 ఆటాడిన జైస్వాల్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఇప్పటికే స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఎదురుదాడే మంత్రంగా విరుచుకుపడిన జైస్వాల్.. ఇంగ్లండ్ బ్యాక్‌ఫుట్‌పైకి నెట్టేయగా.. రెండో రోజు మనవాళ్లు ఎలాంటి గేమ్‌ప్లాన్‌తో బరిలోకి దిగుతారో చూడాలి!



యశస్వి (76*)

### స్టేడియం కళకళ..

భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు మ్యాచ్‌కు వేదికైన ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం ప్రేక్షకులతో కళకళలాడింది. గతానికి భిన్నంగా ఈసారి స్టాండ్‌లన్నీ కనోపీలతో కొత్తగా కనిపించాయి. దీనికి తోడు స్టేడియంలో ఉన్న సీటింగ్ అందరినీ ఆకట్టుకుంది. ఐదేండ్ల తర్వాత తొలిసారి నగరంలో జరుగుతున్న టెస్టు మ్యాచ్ కోసం జగన్‌మోహన్‌రావు సారథ్యంలోని హెచ్‌సీఏ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. అభిమానులకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించింది. ఈసారి పాఠశాల విద్యార్థులను ఉచితంగా స్టేడియంలోకి అనుమతించారు. గురువారం ఆటకు 23,734 మంది హాజరయ్యారు. ఈ మధ్య కాలంలో టెస్టు మ్యాచ్‌కు ఈ స్థాయిలో అభిమానులు రావడం ఇదే తొలిసారి.

### సంక్షిప్త స్కోర్లు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 246 (స్టోక్స్ 70, బెయిర్‌స్టో 37; అశ్విన్ 3/68, జడేజా 3/88), **భారత్ తొలి ఇన్నింగ్స్:** 119/1 (యశస్వి 76 నాటౌట్, రోహిత్ 24; లీచ్ 2/24).

# ముషీర్ సూపర్ సెంచరీ

అండర్-19 ప్రపంచకప్

అన్నాదమ్ముళ్లు అదరగొట్టారు! భారత జాతీయ జట్టులో చోటు దక్కించుకునేందుకు చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ భారత-'ఎ' జట్టు తరఫున భారీ సెంచరీతో కదంతొక్కితే.. అతడి తమ్ముడు ముషీర్ ఖాన్ అండర్-19 ప్రపంచకప్‌లో శతక్కొట్టాడు!



ముషీర్ (118)

బ్లూమ్‌ఫాంటైన్: వన్‌డౌన్ బ్యాటర్ ముషీర్ ఖాన్ (118; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీతో చెలరేగడంతో అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. గ్రూప్-'ఎ'లో భాగంగా గురువారం జరిగిన పోరులో యువభారత్ 201 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. ఫలితంగా గ్రూప్‌లో అగ్రస్థానం ఖాయం చేసుకున్న యంగ్ఇండియా సూపర్ సిక్స్‌కు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన యువభారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. ముషీర్‌తో పాటు కెప్టెన్ ఉదయ్ శరణ్ (75) రాణించాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 29.4 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. మన బౌలర్లలో నమన్ తివారీ4, సామీ మూడు వికెట్లు పడగొట్టారు. ముషీర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మరోవైపు ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న అనధికారిక టెస్టులో భారత్-'ఎ' తరఫున బరిలోకి దిగిన సర్ఫరాజ్ ఖాన్ (165; 18 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ సెంచరీతో దుమ్మురేపాడు.

## టాప్‌లోకి విల్లాజియో హైల్యాండర్స్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ రసవత్తరంగా సాగుతున్నది. రౌండ్ రౌండ్‌కు ఆధిక్యం చేతులు మారుతూ వస్తున్నది. రెండో రౌండ్‌లో విల్లాజియో హైల్యాండర్స్ అగ్రస్థానానికి దూసుకొచ్చింది. చారిత్రక గొల్కొండ పరిసరాల్లో జరుగుతున్న టోర్నీలో జట్లన్నీ హోరాహోరీగా తలపడుతున్నాయి. గ్రూపులో టాప్-2లో నిలువడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. గురువారం నాటి పోటీల్లో నిఖిల్ నంజప్ప 38 పాయింట్లతో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. మొత్తంగా విల్లాజియో హైల్యాండర్స్ 196 పాయింట్లతో గ్రూపు-డీలో అగ్రస్థానానికి చేరుకోగా, లహరి కింగ్స్, సింథోకెమ్ స్వింగ్ కింగ్స్ 195 పాయింట్లతో కొనసాగుతున్నాయి. గ్రూపులో టాప్‌లో ఉండటం తమకు సంతోషంగా ఉందని హైల్యాండర్స్ ప్లేయర్ శైలేందర్‌సింగ్ పేర్కొన్నాడు.



మెల్‌బోర్న్: భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్న లేటు వయసులో సంచలనాలు నమోదు చేస్తున్నాడు. అతి పెద్ద వయసులో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరి రికార్డు సృష్టించిన బోపన్న ఇప్పుడు కెరీర్‌లో


## భళా బోపన్న

తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో బోపన్న.. ఫైనల్‌కు చేరాడు. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో గురువారం రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ జోడీ 6-3, 3-6, 7-6 (10/7)తో జాంగ్-మచక్ జంటపై విజయం సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా.. టైబ్రేకర్‌లో బోపన్న ద్వయం పైచేయి సాధించింది. 2013, 2013లో యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన బోపన్నకు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మరి ఈ సారైనా టైటిల్ అందుకుంటాడా చూడాలి. మరోవైపు బోపన్న సహా ఆరుగురు క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులు ప్రకటించింది.

### ఫైనల్లో సబలెంక

అమెరికా యువ సంచలనం కోకో గాఫ్‌కు ఆస్ట్రేలియా ఓపెన్‌లో చుక్కెదురైంది. గురువారం సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక చేతిలో గాఫ్ ఓడింది. హోరాహోరీగా సాగిన పోరులో రెండో సీడ్ సబలెంక 7-6 (7/2), 6-4తో గాఫ్‌ను ఓడించింది. మరో సెమీస్‌లో జెంగ్ 6-4, 6-4తో యస్త్రంస్కాపై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో జ్వెరెవ్, మెద్వెదెవ్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు.

### భద్రతా వైఫల్యం



ఉప్పల్ టెస్టు మ్యాచ్‌లో పోలీసుల భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించింది. భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో పోలీసుల కండ్లు కప్పి విరాట్ కోహ్లీ జెర్సీ ధరించిన అభిమాని..మైదానంలో ఉన్న రోహిత్ దగ్గరకు దూసుకెళ్లాడు. రోహిత్ కాళ్లు మొక్కేందుకు ప్రయత్నించిన అభిమానిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే వెహికిల్ పాస్‌లు ఉన్నా..స్టేడియంలోనికి అనుమతించే విషయంలో పోలీసులు ఇబ్బందులకు గురిచేశారు. దీనికి తోడు క్యాటరింగ్ వాహనాలకు పాస్ లేవన్న కారణంతో ఆపేయడంతో కార్పొరేట్ బాక్స్ అభిమానులు, మీడియా సిబ్బందికి గంట ఆలస్యంగా భోజనాలు అందాయి.

ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా.. తన ఆరాధ్య టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్‌ను గురువారం జ్యూరిచ్‌లో కలిశాడు. ఫెదరర్ క్రీడాస్ఫూర్తికి తాను పెద్ద అభిమానినని నీరజ్ పేర్కొన్నాడు.








Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.